1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 98 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 13 ఏప్రిల్ 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 98 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Monday 13 April 2026 PAGES : 8 PRICE : 3/-



# ప్రభుత్వ సేవల్లో చిన్నపాటి లోపాలూ వద్దు

- కూటమి శ్రేణులు కలిసి పనిచేస్తే తిరుగుండదు
- పాలనా వ్యవహారాల్లో కుటుంబీకుల పెత్తనం తగ్గించండి
- కాకినాడ జిల్లా ప్రజా ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 12)

ప్రభుత్వ సేవల్లో చిన్నపాటి లోపాలు కూడా ఉండకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 'నెల్లూరు మోడల్' అవలంబించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని సామాజిక మాధ్యమాల వేదికగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీల శ్రేణులు కలిసి పనిచేస్తే తిరుగుండదని పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో కాకినాడ జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో చంద్రబాబు శనివారం సమావేశమయ్యారు. "ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి ఉంది. ప్రజలతో మమేకమైతే భవిష్యత్తులో మంచి విజయాలు దక్కించుకోవచ్చు. కులాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నాం. అన్ని కులాల్లోనూ మనకు ఆదరణ పెరగాలి. చెడు వెళ్లినంత వేగంగా మంచి వెళ్లదు. ఎమ్మెల్యేలు దీన్ని దృష్టిలో పెట్టుకోవాలి" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన పలు అభివృద్ధి పనులకు సీఎం పచ్చజెండా ఊపారు.

**కొందరు నేతలు పద్ధతి మార్చుకోవాలి :** "ప్రజాప్రతినిధులుగా మీరే పాలనా వ్యవహారాల్లో ముందుండాలి కదా.. కుటుంబ సభ్యులు, అనుచరుల ప్రమేయం ఎక్కువగా ఎందుకుంటోంది? వారి వ్యవహారాలు శ్రుతిమించితే ప్రభుత్వానికి, పార్టీకి నష్టం కలిగిస్తాయి. ఈ పద్ధతిని మార్చుకోవాలి' అని ముఖ్యమంత్రి కాకినాడ జిల్లా నేతలకు హితవు పలికారు. రామచంద్రాపురం నియోజకవర్గంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం జోరు ఎక్కువగా కనిపిస్తుందని.. ఆయనను కొంత వెనక్కి తగ్గేలా చూడాలని మంత్రికి సూచించినట్లు సమాచారం. ప్రత్తిపాడు, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల అనుచరుల పేర్లు చదివి వారు హద్దు మీరి వ్యవహరిస్తున్నారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పినట్లు తెలిసింది. పెద్దాపురం, జగ్గంపేటలలో వారసుల పనితీరుపైనా పరోక్షంగా నేతలకు ▶మిగతా 2లో

# బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 12)

బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జ్యోతిరావు పులే ద్విశతాబ్ది జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సామాజిక రంగంలో విశేషంగా కృషి చేసిన 11 మంది ప్రతిభావంతులకు ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పులే పురస్కారాలు అందజేశారు. వివిధ బీసీ కార్పొరేషన్ల ఛైర్మన్‌లను మంత్రి సవిత సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త' సంకల్పంతో బీసీల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. పులే స్మృతివనం ఏర్పాటుకు ప్రభుత్వం స్థల పరిశీలన చేస్తోందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 1982లో ఎన్టీఆర్ తెదేపాను స్థాపించిన అనంతరమే బీసీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా గౌరవప్రదమైన గుర్తింపు లభించిందన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం బీసీల రక్షణ నిమిత్తం ప్రత్యేకంగా రక్షణ చట్టాన్ని తీసుకొస్తుందని పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం కల్పించాలన్న లక్ష్యానికి కట్టుబడిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర మంత్రివర్గంలో ఎనిమిది మంది బీసీలకు ప్రాతినిథ్యం కల్పించారని కొనియాడారు. కేంద్ర క్యాబినెట్‌లో 27 మంది బీసీ మంత్రులు ఉండడం గర్వకారణమన్నారు.

# జగన్ మానసిక పరిస్థితి, నైజాన్ని ప్రజలు గమనించాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 12)

"వైకాపా లాంటి రాజకీయ పార్టీని నడుపుతున్న జగన్ మానసిక స్థితి, నైజం ప్రజలందరూ గమనించాలి. ఆ పార్టీ సిద్ధాంతమే విధ్వంసం, వినాశనం. పార్టీ నినాదం రప్పా.. రప్పా. ఐదేళ్ల పాలన చూసిన ప్రజలు చెంపదెబ్బ కొట్టినట్లు తీర్పు చెప్పినా, ఎక్కడా పశ్చాత్తాపం లేకుండా మళ్లీ అధికారంలోకి వస్తే వినాశనం చేస్తామంటున్నారు. వీవీ (విధ్వంసం, వినాశనం) అని పార్టీ పేరు పెట్టుకుని, గొడ్డలి గుర్తు పెట్టుకోండి. ఎందుకంటే వైకాపా కార్యకర్తలందరూ రోడ్లపైకి వచ్చి ఫ్యాన్ గుర్తు చూపించడం లేదు. గొడ్డలి, కత్తులు పట్టుకుని తిరుగుతున్నారు. ▶మిగతా 2లో

# ఏం ఉద్ధరించారని జగన్‌నెల్లూరు పర్యటన?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 12)

'కృష్ణపట్నం పోర్టుకు 1996లో నేను మొదటిసారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2008 అక్టోబరు 8న అప్పటి సీఎం వైఎస్ కృష్ణపట్నం పోర్టు నుంచి వాడరేవు వరకు ఎలాంటి పోర్టులూ, హార్బర్లూ నిర్మించకూడదని జీవో 40 ఇచ్చారు. 2009లో దానికి ▶మిగతా 2లో

# ఇరాన్‌పై ట్రంప్ తదుపరి అస్త్రం అదేనా.. అధ్యక్షుడి హింట్..?



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 12)

ఇరాన్‌తో చర్చలు విఫలమవడంతో అమెరికా ఎటువంటి చర్యలు తీసుకుంటుందోనని ప్రపంచ దేశాల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో తమ డిమాండ్లను అంగీకరించకపోతే ఇరాన్ నౌకలను దిగ్బంధించే అవకాశం ఉన్నట్లు చెబుతున్న ఓ మీడియా కథనాన్ని ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో ఇరాన్‌పై తదుపరి ప్రణాళికల గురించి ట్రంప్ పరోక్షంగా హింట్ ఇచ్చారా అని అంతర్జాతీయ మీడియా అనుమానం వ్యక్తం చేస్తోంది. ట్రంప్ షేర్ చేసిన వార్తా కథనంలో.. 'ఇరాన్ అమెరికా డిమాండ్లకు లొంగకపోతే అధ్యక్షుడి వద్ద ఉన్న అస్త్రం నౌకాదళంతో దిగ్బంధనమే. ఇరాన్ నౌకలను ఉన్న ప్రదేశం నుంచి కదలనీయకుండా చేయడం వల్ల చమురు ఎగుమతులపై ఆధారపడిన ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పతనమవుతుంది. టెహ్రాన్ నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దాని మిత్ర దేశాలైన చైనా, భారత్‌పైనా ఈ ప్రభావం పడుతుంది. వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురోను అమెరికా నిర్బంధించడానికి ముందు కూడా ఇదే విధంగా ఆ దేశంలోని నౌకలను దిగ్బంధించారు. ఆ విజయవంతమైన ప్లాన్‌ను ట్రంప్ ఇరాన్‌పైనా అమలు చేసే అవకాశం ఉంది' అని మీడియా సంస్థ అంచనావేసింది. పాకిస్థాన్‌లో ఇరాన్‌తో జరిగిన చర్చలు విఫలమైనట్లు ప్రకటించిన కొన్ని గంటల అనంతరం ట్రంప్ ఈ పోస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# పాక్ మాత్రమే అటువంటి పాత్ర పోషిస్తుంది - థరూర్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 12)

అమెరికా-ఇరాన్‌ల మధ్య పాకిస్థాన్ వేదికగా శాంతి చర్చలు కొనసాగుతున్నాయి. తాజా పరిణామాలపై కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ తనదైన శైలిలో స్పందించారు. ఈ విషయంలో భారత్.. పాక్‌తో పోటీ పడుతున్నట్లు భావించడం లేదన్నారు. మధ్యవర్తిత్వం ఎవరు వహించారనేది ముఖ్యం కాదని, శాంతి నెలకొల్పడమే ప్రధాన అంశమన్నారు. ఈ సందర్భంగా పాక్ ప్రధాని ఇటీవల సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్టును ప్రస్తావిస్తూ.. అమెరికా, పాక్ సంబంధాల గురించి అందరికీ తెలిసిందేనని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ▶మిగతా 2లో



# టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డకు భారీ ఊరట... విదేశాలకు వెళ్లేందుకు కోర్టు గ్రీన్ సిగ్నల్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 12)

గత ప్రభుత్వ హయాంలో ఎదురైన కేసులు తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. తాజాగా ఈ కేసుల కారణంగా ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తన అమెరికా పర్యటనకు తీవ్ర ఆటంకాలను ఎదుర్కొన్నారు. అయితే, సుదీర్ఘ నిరీక్షణ అనంతరం పలు కఠినమైన షరతులతో ▶మిగతా 2లో

# దివికేగిన లెజెండరీ గాయని ఆశా భోంస్లే



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 12)

భారతీయ సంగీత ప్రపంచంలో ఓ శకం ముగిసింది. సుప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే ఇక లేరు. తీవ్ర అస్వస్థతతో శనివారం ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆశా భోంస్లే.. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. శనివారం తీవ్రమైన నీరసం, ఛాతీలో ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు ఐసీయూకి తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆమె మరణ వార్తను కుమారుడు ఆనంద్ భోంస్లే, మనవరాలు జానై భోంస్లే ధృవీకరించారు.ఆమె పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అభిమానుల సందర్శనార్థం ఆమె నివాసంలో ఉంచనున్నారు. అనంతరం, సాయంత్రం 4 గంటలకు ముంబైలోని శివాజీ పార్కులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.దిగ్గజ గాయని లతా మంగేష్కర్ కు ఆశా భోంస్లే స్వయానా సోదరి. బ్రిటీష్ ఇండియాలోని సాంగ్లీ స్టేట్ లో 1933 సెప్టెంబర్ 8న జన్మించారు. ▶మిగతా 2లో

# "జగన్ పోకడలు భరించలేం.. అతన్ని బెంగళూరులోనే ఉంచండి" అని విజయమ్మ నాడే చెప్పారు: మంత్రి నిమ్మల



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 12)

వైసీపీ అధినేత జగన్ రాజకీయాలు ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదంతో సాగుతున్నాయని, ఆయన 'గొడ్డలి రాజకీయం' రాష్ట్రానికి పెను ప్రమాదంగా పరిణమించిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నరుకుతాం, చంపేస్తాం" అనే నీచమైన భాషతో రాజకీయాలు చేస్తూ, విధ్వంసాన్నే తమ అజెండాగా వైసీపీ మార్చుకుందని ఆయన విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ రెడ్డి తన హిడెన్ అజెండాను ఇప్పుడు బహిరంగంగానే ప్రకటిస్తున్నారని అన్నారు. అధికారం కోసం ఎంతటి దారుణానికైనా ఒడిగట్టేలా వారి తీరు ఉందని మండిపడ్డారు.

**ఉగ్రవాదం కన్నా ప్రమాదకరం :** రాజకీయ పార్టీలు ప్రజలకు మేలు చేస్తామని చెప్పాలి కానీ, వైసీపీ మాత్రం తాము అధికారంలోకి వస్తే ఉన్నవి పడగొడతామని, పనులు ఆపేస్తామని, యువతను చెడగొడతామని చెబుతోందని నిమ్మల ఎద్దేవా చేశారు. వైసీపీ 'యూత్ పాలసీ' అంటే మద్యం వ్యాపారాలు చేయడం, కొత్త మాదక ద్రవ్యాలు తెచ్చి యువత భవిష్యత్తును నాశనం చేయడమేనా? అని ప్రశ్నించారు. "గుంటూరు ఇవతల లాగి కొడతాం, అవతల నరుకుతాం" అని బాహాటంగా హెచ్చరిస్తూ, తల్లులకు పుత్రశోకం మిగిల్చడానికే వైసీపీ నేతలు అధికార దాహంతో ఉన్నారని ఆరోపించారు. జంతువులను నరికి ఆ రక్తాన్ని ఫ్లెక్సీలపై ▶మిగతా 2లో

# కంభం అర్బన్ కాలనీలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

150 ఇండ్లలో సోదాలు

27 వాహనాలు స్వాధీనం





(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 12)

పట్టణంలోని అర్బన్ కాలనీలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంభం సీఐ మల్లికార్జునతో పాటు కంభం ఎస్ఐ శివ కృష్ణారెడ్డి, బేస్తవారిపేట ఎస్ఐ రవీంద్రారెడ్డి, అర్ధవీడు ఎస్ఐ నాంచారయ్యతో పాటు మొత్తం 45 మంది పోలీసు సిబ్బంది పాల్గొని ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా కంభం సీఐ మల్లిఖార్జున మాట్లాడుతూ మొత్తం 150 ఇళ్లను తనిఖీ చేయగా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదన్నారు. సరైన పత్రాలు లేని 27 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, అందులో 3 మోటార్ సైకిళ్ల యజమానులు లేకపోవడంతో సెక్షన్ 102 సిఆర్‌పిసి కింద సీజ్ చేశామని తెలిపారు. అలాగే 120 మంది వ్యక్తుల ఫింగర్ ప్రింట్లను (పిఐఎన్ఎస్) పరికరం ద్వారా తనిఖీ చేయగా ఎలాంటి నేర చరిత్ర ఉన్నవారు గుర్తించబడలేదని, మోటార్ వాహన చట్టం ఉల్లంఘించిన వాహనాల పై ఈ చలాన్లు విధించామని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రజలు గంజాయి వినియోగం, క్రికెట్ బెట్టింగ్, రోడ్డు భద్రతా ఉల్లంఘనలు, సైబర్ నేరాల నివారణలో పోలీసులకు సహకరించాలని స్థానిక ప్రజలతో కలిసి ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# క్వాంటం ఐఐటి అకాడమీ ప్రారంభం

అకాడమీని ప్రారంభించిన

ఏంపి మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

నగరంలోని విఐపి రోడ్డు రెండవ అడ్డరోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన క్వాంటం ఐఐటి అకాడమీని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వాసులకు మంచి విద్యను అందించి ఐఐటీలో మంచి సీట్లు సాధించి వారి ఉజ్వల భవిష్యత్తుకు మంచి పునాది వేయాలని కోరారు. అకాడమీ యాజమాన్యం ఎన్ వి హరికుమార్ గుప్తా, అబ్దుర్ రహీం, సాకేత్ రామ్ కమల్ మాట్లాడుతూ మా ముగ్గురు పిల్లలు ఈపాటికే ఐఐటీలో చదువుతున్నారని, జిల్లా వాసులకు కూడా ఐఐటి విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ అకాడమీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని విద్యార్థులు అకాడమీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, టిడిపి ఒంగోలు నగర అధ్యక్షులు బందారు మదన్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

# ప్రభుత్వ సేవల్లో చిన్నపాటి లోపాలూ వద్దు

సూచించినట్లు సమాచారం. అనపర్తి నియోజకవర్గంలో వైకాపా నుంచి పార్టీలోకి వచ్చిన వ్యక్తికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయని, వాటిని సరిచేసుకోవాలని సీఎం చెప్పారు. 'కాకినాడ నగరంలో పార్టీ నేతల మధ్య సమన్వయలోపం కనిపిస్తుంది. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ స్థానికంగా అందుబాటులో తక్కువగా ఉంటున్నారు. తుని నియోజకవర్గంలో ఎమ్మెల్యే కంటే వారి కుటుంబ సభ్యులే కార్యక్రమాలను నడిపిస్తున్నట్లు ఉంది. ఇందులో మార్పు రావాలి. ప్రజాప్రతినిధులే ముందుండి నడిపించాలి' అని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది. జిల్లాకు రేషన్ బియ్యం వ్యవహారం చెడ్డపేరు తెస్తోందని, గంజాయి మూలాలు లేకుండా చూడాలని, ఎమ్మెల్యేలందరితో సమన్వయం చేసుకోవాలని ఎస్పీకి సూచించినట్లు సమాచారం.

# దివికేగిన లెజెండరీ గాయని ఆశా భోంస్లే

1943లో ఆమె తన సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో 20కి పైగా భాషల్లో 12,000కు పైగా పాటలు పాడి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (2011)లో స్థానం సంపాదించారు. తెలుగులో కూడా ఆమె పాడిన ఎన్నో పాటలు విశేష ప్రజాదరణ పొందాయి. ఆమె మరణం భారత సంగీత ప్రపంచానికి తీరని లోటు.

## టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డకు భారీ ఊరట... విదేశాలకు వెళ్లేందుకు కోర్టు గ్రీన్ సిగ్నల్

ఆయన విదేశీ పర్యటనకు మచిలీపట్నం ఎస్సీ, ఎస్టీ జిల్లా కోర్టు అనుమతి మంజూరు చేసింది. దీంతో ఆయనకు ఊరట లభించినట్లయింది. గత రెండేళ్లుగా అమెరికాలో ఉన్న తన వ్యాపార కార్యకలాపాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు యార్లగడ్డ వెంకట్రావు ప్రయత్నిస్తున్నారు. అయితే, గత ప్రభుత్వ కేసులను కారణంగా చూపుతూ న్యాయస్థానాలు ఆయన విదేశీ పర్యటనకు అనుమతులు నిరాకరిస్తూ వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయన మరోసారి కోర్టును ఆశ్రయించగా, ఈసారి సానుకూల స్పందన లభించింది. అయితే, న్యాయస్థానం పర్యటనకు అనుమతి ఇస్తూనే పలు కఠినమైన నిబంధనలను విధించింది. ఈ నిబంధనలన్నీ పక్కాగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.కోర్టు విధించిన షరతుల ప్రకారం.. యార్లగడ్డ తరఫున నలుగురు వ్యక్తులు పూచీకత్తు సమర్పించాలి. అమెరికా పర్యటనకు బయలుదేరే ముందు, అక్కడ ఏ ప్రాంతంలో, ఏ చిరునామాలో ఉంటారనే పూర్తి వివరాలను లిఖితపూర్వకంగా కోర్టుకు తప్పనిసరిగా అందించాలి. ఇక్కడి నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి వచ్చేవరకు తన సెల్ ఫోన్‌ను ఎల్లప్పుడూ ఆన్‌లోనే ఉంచుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 జూలై 15 తేదీలోపు తిరిగి భారతదేశానికి రావాలి. కోర్టు అనుమతుల పొడిగింపునకు ఎలాంటి ప్రయత్నం చేయకూడదని, అనుమతిలోని షరతులను ఉల్లంఘించరాదని న్యాయస్థానం తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది.దేశానికి తిరిగి వచ్చిన వారం రోజుల్లోపు కచ్చితంగా కోర్టు ఎదుట హాజరు కావాలని ఆదేశిస్తూ అమెరికా పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. న్యాయస్థానం నుంచి అనుమతులు లభించడంతో, ఈ నెలాఖరు వారంలో అమెరికాకు వెళ్లేందుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

# ఏం ఉద్ధరించారని జగన్‌నెల్లూరు పర్యటన?

అనుబంధంగా మరో జీవో కూడా జారీ చేశారు. ఫలితంగా రామాయపట్నం పోర్టుతో పాటు జువ్వలదిన్నె హార్బర్ కట్టే అవకాశం లేకుండా పోయింది. నాడు తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని అదనపు ఆదాయం కోసం కృష్ణపట్నం పోర్టు కేంద్రంగా ఆధిపత్యం చెలాయించిన జగన్.. ఏం సాధించారని ఇప్పుడు జువ్వలదిన్నెకు వస్తున్నారో చెప్పాలి" అని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. శనివారం నెల్లూరులో మాట్లాడారు. '2014లో అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం చేపట్టిన చర్యలతో జువ్వలదిన్నె హార్బర్‌తో పాటు రామాయపట్నం పోర్టులో కదలిక వచ్చింది. జువ్వలదిన్నె హార్బర్‌ను కూటమి ప్రభుత్వంలో సాధించాం. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా కేవలం టెండర్ పిలిచి డబ్బులు దండుకుంది. ఇప్పుడు ఏం చెప్పుకోవడానికి జగన్ ఇక్కడకు వస్తున్నారు" అని ప్రశ్నించారు.

# పాక్ మాత్రమే అటువంటి పాత్ర పోషిస్తుంది - థరూర్

"వాషింగ్టన్‌తో పాకిస్థాన్‌కు ఎటువంటి సంబంధం ఉందో మీకు తెలుసా? పాక్ ప్రధాని ఇటీవల పోస్టు చేసిన ట్వీట్ అమెరికా రూపొందించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆ హెడింగ్ చూస్తేనే అందరికీ అర్థమవుతుంది. అందులో వాడిన భాష కూడా అమెరికాదే. అందులో కొన్ని పదాలు ట్రంప్ ఉపయోగించేవే. వాషింగ్టన్ విషయంలో పాక్ పోషించిన పాత్రను వేరే ఏ దేశం కూడా పోషించలేదు" అని థరూర్ పేర్కొన్నారు.

**వెనక్కి వచ్చి.. రాహుల్‌తో మోదీ మాటామంతి**

ఇరాన్‌తో దాదాపు 900 కి.మీ సరిహద్దు పాకిస్థాన్‌కు ఉందని, ఒకవేళ సంక్షోభం మరింత ముదిరితే శరణార్థుల తాకిడి ఆ దేశానికి ఎక్కువగా ఉంటుందని థరూర్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మనతో పోలిస్తే పాకిస్థాన్ ఆశించే ప్రయోజనాలు వేరని పేర్కొన్నారు. చర్చల ఫలితమే భారత్‌కు ముఖ్యమని, అవి ఎలా జరిగాయనే విషయం కాదన్నారు. మధ్యవర్తిత్వం ఎవరు వహిస్తారన్నది ముఖ్యం కాదన్నారు.

# "జగన్ పోకడలు భరించలేం.. అతన్ని బెంగళూరులోనే ఉంచండి" అని విజయమ్మ నాడే చెప్పారు: మంత్రి నిమ్మల

చల్లుతూ రాక్షసానందం పొందేవారు ప్రజలకు ఏం మేలు చేస్తారని నిలదీశారు.

వాస్తవాలు రాస్తున్న మీడియా సంస్థల నాలుకలు కోస్తామని బెదిరించడం రాజ్యాంగం కల్పించిన ఫోర్త్ ఎస్టేట్ గొంతు నొక్కడమేనని అన్నారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదని, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోకుండా మరింత ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**వివేకా హత్యపై ప్రశ్నల వర్షం**

వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ మంత్రి నిమ్మల, జగన్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. "రాజకీయాల కోసం సొంత బాబాయ్‌నే గొడ్డలితో వేటు వేసిన చరిత్ర జగన్‌ది. వివాదరహితుడైన వివేకాను ఎంపీ పదవికి రాజీనామా చేయాలని బెదిరించినప్పుడు, నాడు సోనియా గాంధీ మిమ్మల్ని మందలించింది నిజం కాదా?" అని ప్రశ్నించారు. వివేకా గొడ్డలిపోటుతో చనిపోతే, దాన్ని 'గుండెపోటు'గా సాక్షి మీడియాలో ఎందుకు ప్రచారం చేశారని నిలదీశారు. సొంత చిన్నాన్న హత్యకు గురైతే 12 గంటలు ఆలస్యంగా వచ్చి సాక్ష్యాలు చెరిపేయడంలో ఎందుకు నిమగ్నమయ్యారని అడిగారు. ప్రపంచంలో ఎక్కడైనా హత్యకు గురైన వ్యక్తికి కుట్లు వేసి కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తారా? అని మండిపడ్డారు. పరిటాల రవి హత్య కేసులో సాక్షులు మాయమైనట్లే, నేడు వివేకా హత్య కేసులోనూ సాక్షులను మాయం చేస్తున్నారని, దీనికి జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**కుటుంబ సభ్యుల పట్ల వైఖరి ఇదేనా?**

జగన్ రెడ్డి తన కుటుంబ సభ్యుల పట్ల వ్యవహరించిన తీరును రాష్ట్ర ప్రజలంతా చూశారని నిమ్మల అన్నారు. "నా తల్లి, నా చెల్లి" అంటూనే వారిని ఇంటి నుంచి బయటకు గెంటారని ఆరోపించారు. ఇప్పుడు రాష్ట్రంలోని మహిళలకు మేలు చేస్తానని చెప్పడం నయవంచన కాదా? అని ప్రశ్నించారు.

నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించి, ఆయన ఆచూకీ కూడా తెలియని సమయంలో సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి కావాలని చూడటం జగన్ వికృత మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు. "జగన్ రాకను తండ్రి రాజశేఖర్ రెడ్డి గారే ఇష్టపడలేదు. మీరు చెప్పి అతన్ని బెంగళూరులోనే ఉండమనండి" అని స్వయంగా విజయమ్మ గారే నాడు రోశయ్య గారికి ఫోన్ చేసి వేడుకున్నారని, దీన్నిబట్టి జగన్ నైజం అర్థం చేసుకోవచ్చని తెలిపారు.

**రంగా గారి పేరు ఎత్తే అర్హత లేదు**

వంగవీటి రంగా గారి గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని నిమ్మల రామానాయుడు ఘాటుగా విమర్శించారు. "రంగా గారి హంతకులను అక్కున చేర్చుకున్న చరిత్ర జగన్‌ది. రంగా హత్య కేసులో ప్రధాన నిందితుడి కుమారుడు ఈరోజు ఏ పార్టీలో ఉన్నాడో జగన్ చెప్పాలి. హంతక కుటుంబానికి హైదరాబాద్‌లో కోట్ల విలువైన భూమిని ఎందుకు గిఫ్ట్‌గా ఇచ్చారు?" అని ప్రశ్నించారు.

రంగా గారిని 'రౌడీ' అని అవమానించిన గౌతమ్ రెడ్డికి ఫైబర్ గ్రిడ్ ఛైర్మన్ పదవి ఇచ్చి సత్కరించడం, రంగా గారిపై జగన్‌కు ఉన్న విద్వేషానికి నిదర్శనమని అన్నారు. హంతక కుటుంబాలతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూ రంగా పేరు ఎత్తడానికి సిగ్గుండాలని మండిపడ్డారు.

**గొడ్డలి పార్టీకి రాజకీయ సమాధి**

నాడు తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆర్థిక ఉగ్రవాదిగా మారిన జగన్, నేడు రాజకీయ ఉగ్రవాదిగా మారి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని నిమ్మల ఆరోపించారు. 2019–24 మధ్య వైసీపీ పాలనతో జరిగిన నష్టం, రాష్ట్ర విభజన నష్టం కన్నా ఎక్కువని అన్నారు. ఆ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ పట్టాలెక్కిస్తున్నారని తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడిన పడుతుంటే, మళ్లీ విధ్వంసం సృష్టించాలని జగన్ చూస్తున్నారని విమర్శించారు. వైసీపీ జెండాను పక్కనపెట్టి 'గొడ్డలి'ని జెండాగా చేసుకున్న ఈ 'గొడ్డలి పార్టీ'కి ప్రజలు రాజకీయ సమాధి కట్టాలని, ఇలాంటి ఉన్మాద పార్టీని రాష్ట్రం నుంచి శాశ్వతంగా తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# జగన్ మానసిక పరిస్థితి, నైజాన్ని ప్రజలు గమనించాలి

వైకాపాకి అధికారం పోయినా ఇంకా అహంకారం తగ్గలేదు. ఉగ్రవాదుల ఉన్మాదాన్ని మించి ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా రాజకీయాలు చేస్తోంది" అని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖ తెదేపా కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైఎస్ మరణం నుంచి ఎన్నో అడ్డుపెట్టుకొని అంతిమ లబ్ధిదారు జగనే అయ్యారని, ప్రజలకు మాత్రం విధ్వంసం, వినాశనమే మిగిలిందని ఆరోపించారు.

అప్పుడే మావిగన్ తట్టలేదేమో: 'కూటమి చేసే ప్రతి పనినీ నేనే ముందు చేశానంటూ జగన్ మానసిక వ్యాధితో మాట్లాడుతున్నారు. 'మావిగన్' అంటే మానసిక పరిస్థితి బాగోలేని రోగులు వాడే మందు అని తెలిసిన వాళ్లు చెప్పారు. అధికారం లేనంతసేపూ జగన్ అమరావతే తన రాజధాని అన్నారు. అమరావతిలోనే ఇల్లు కట్టుకున్నా అన్నారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చి మూడు రాజధానులన్నారు. అప్పుడే ఈ బుర్రకు మావిగన్ తట్టలేదేమో. ఐదేళ్లూ రాజధానిని పూర్తిగా నాశనం చేసి, రైతులను మానసిక క్షోభకు గురిచేసి, సుమారు 300 మంది చనిపోవడానికి జగన్ కారణమయ్యారు. మహిళా రైతులను కాలి బూట్లతో తన్నించిన నైజం ఉన్న వ్యక్తి మళ్లీ బయటకు వచ్చి చేస్తున్న నిర్వాకాలను ప్రజలు అర్థం చేసుకోవాలి" అని అనిత కోరారు.

# సైకిల్ పోలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక

# రాష్ట్రంలో సైకిల్ పోలో అభివృద్ధికి కృషి

## రామకృష్ణారావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో జరిగిన సైకిల్ పోలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో అధ్యక్షులుగా ఎన్నికైన రామకృష్ణ రావు రాష్ట్రం లో సైకిల్ పోలో అభివృద్ధికి తన వంతు సహాయం చేస్తా అని తెలిపారు. తమ అసోసియేషన్‌లో ఉన్న ప్రతి జిల్లా సెక్రటరీ తమ వంతు కృషి చేస్తున్నారు అని ఆయన అన్నారు. అనంతరం ముఖ్య అతిధిగా విచ్చేసిన హైదర్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ మరియు ఆంధ్రప్రదేశ్ సైకిల్ పోలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చంద్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం లో సైకిల్ పోలో సైకిల్ పోలో అభివృద్ధికి తనవంతు కృషి చేస్తన్నన్నారు. అధ్యక్షులు రామకృష్ణరావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గనికి శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్రంలో ఎక్కడ సైకిల్ పోలో జరిగిన తాను ముందు వరుస ఉండి ఏ ఒక్క క్రీడాకారుడికి అన్యాయం జరగకుండా చూస్తన్నానారు. క్రితం ఉన్న అసోసియేషన్ లాగా దోచుకోవడం తమ ఉద్దేశం కాదని రాష్ట్రంలో ప్రతి సైకిల్ పోలో క్రీడాకారుడికి సమన్యాయం జరిగేటట్లు చేయడమే తమ ఉద్దేశం అని ఆయన తెలిపారు. నూతన కార్యవర్గ కార్యదర్శి రేవంత్ మాట్లాడుతూ 1952లో ఈ క్రీడా హైదరాబాద్‌లో ప్రాచుర్యం చెందాగా 20 సంవత్సరాల తరువాత భారతదేశంలో ఆదరణ పొందింది అని తెలిపారు. దేశంలో మన రాష్ట్రానికి ఉన్న ప్రాధన్యంతో మన కృష్ణా జిల్లా సీనియర్ క్రీడాకారుడు గణేష్ ను టెక్నికల్ అండ్ టోర్నమెంట్ డైరెక్టర్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల కార్యదర్శులతో పాటు సైకిల్ పోలో ఉపాధ్యక్షులు ప్రసాద్, అబ్దుల్ కరీం, కోశాధికారి సునీల్ కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముక్కంటి చంద్రశేఖర్, ఖాసీం, ఆంధ్రప్రదేశ్ సైకిల్ పోలో క్రమశిక్షణ కమిటీ మెంబెర్, తదితరులు పాల్గొన్నారు.




ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
13.04.26 సోమవారం


# ఇదే లాస్ట్ వార్నింగ్...
## ఈసారి యాక్షన్ తప్పదు



### హాస్టల్ వార్డెన్‌లపై ఎమ్మెల్యే ఇంటూరి సీరియస్
### ప్రభుత్వ హాస్టల్స్‌లో ఎమ్మెల్యే ఇంటూరి ఆకస్మిక తనిఖీలు
### మెనూ పాటించకపోవడం పై ఆగ్రహం



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 12)**
ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ లో సమస్యలు, సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీలు మొదలు పెట్టారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా, వారికి అన్ని సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం కందుకూరు పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్, పక్కనే ఉన్న టిఆర్ఆర్ కళాశాల బాలికల హాస్టళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విద్యా ర్థులతో మాట్లాడారు. వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. తనిఖీ సమయంలో రెండుచోట్ల వార్డెన్లు విధుల్లో లేకపోవడం పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ లో అపరిశుభ్ర వాతావరణాన్ని గమనించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు పరిసరాలు ఇలా ఉంటే విద్యార్థులకు జబ్బులు రావా అని వార్డెన్ ను నిలదీశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. మెనూ (తరువాయి 4లో...)

# ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ మాయలో పడొద్దు
### అది జీవితాలను నాశనం చేస్తుంది
### జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)**
గత కొద్దిరోజులుగా క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేక పోలీస్ బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇటీవల దర్శి పోలీస్ స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఇంకా కొంతమందిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నామన్నారు. అలాగే, క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొంటున్న వారిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్ చట్టవిరుద్ధమని, ఇది వ్యక్తుల ఆర్థిక మరియు సామాజిక జీవితాలను దెబ్బతీస్తుందని జిల్లా ఎస్పీ గారు హెచ్చరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవి మోసపూరితంగా ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుందని సూచించారు. క్రికెట్ బెట్టింగ్ కారణంగా అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. క్రికెట్ మ్యాచ్‌లను వినోదం కోసమే చూడాలని, బెట్టింగ్ వైపు మొగ్గు చూపకూడదని యువత, ప్రజలకు సూచించారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ పాల్పడేవారిపై ఏపీ జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 112కు లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

# ధర్మవరంలో అర్ధరాత్రి ఆర్ఎంపీ డాక్టర్ దారుణ హత్య
### ఉలిక్కిపడిన గ్రామస్తులు
### అక్రమ సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు అనుమానం
### కర్రలు, కత్తులతో నరికి చంపిన దుండగులు




**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 12)**
ధర్మవరం గ్రామంలో దారుణ హత్య ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మేడగం కోటిరెడ్డి అనే ఆర్ఎంపీ డాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత కిరాతకంగా హతమార్చారు. శనివారం అర్ధరాత్రి వేళ మృత్యువు తాండవించింది. పక్కా ప్లాన్‌తో వచ్చిన దుండగులు, ఇంట్లోకి చొరబడి కోటిరెడ్డి భార్యను తాళ్లతో కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కారు. ఆమె కళ్ళముందే కోటిరెడ్డి పై కర్రలు, కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి హతమార్చారు. దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న అద్దంకి పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతిని భార్య నుండి పోలీసులు హత్య జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ హత్య అక్రమ సంబంధాల నేపథ్యంలోనే జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. గ్రామంలో (తరువాయి 4లో...)

# పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది
### 109 మంది లబ్ధిదారులకు ఎల్ఓసి, సిఎంఆర్ఎఫ్ చెక్కులు
### రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

**(షణ్ముఖ వెలుగు, సంతమాగులూరు, ఏప్రిల్ 12)**
పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం సంతమాగులూరులో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. 88 మంది లబ్ధిదారులకు రూ. 84.77 సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేయగా, అత్యవసర వైద్య చికిత్స కోసం 21 మందికి లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీలు)ను మంత్రి స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనేక కుటుంబాలు ఆర్థిక భరోసా పొందుతున్నాయని, ముఖ్యంగా అత్యవసర వైద్య చికిత్స సమయంలో ఈ సహాయం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. వైద్యం, విద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రజలు మంచి వైద్యసేవలు పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, పేదల ఆరోగ్య రక్షణ కోసం పలు పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. అలాగే విద్యారంగంలోనూ నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో (తరువాయి 4లో...)

# డాక్టర్ రమేష్ కృష్ణకు అభినందనల వెల్లువ

### ఒంగోలులో ప్రముఖుల చేతుల మీదుగా నాలుగు పుస్తకాల ఆవిష్కరణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)
ప్రముఖ సాహిత్యవేత్త, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు, ఒంగోలులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్, బహు గ్రంధకర్త, నాట్య కోవిదులు నృత్య శిక్షకులు డాక్టర్ రామచంద్రుని రమేష్ కృష్ణ రచించిన నాలుగు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం రాజీవ్‌నగర్ లోని శ్రీ సత్య శ్రీనివాససదన్ లో జాతీయ సాహిత్య సాంస్కృతిక సమితి, అవసర ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో అభిమాన జన సందోహం నడుమ నేత్ర పర్వంగా ఘనంగా జరిగింది. డాక్టర్ రమేష్ కృష్ణ రచించిన శ్రీ ఆశ్చర్య రామాయణం (తెలుగు), బాలవాల్మీకిరామాయణ్ (హిందీ), బాలమహాభారత్ (హిందీ), బాలభాగవత్ (హిందీ) గ్రంథాలను ప్రముఖ హరికథా కళాకారిణి పద్మశ్రీ డి ఉమామహేశ్వరి, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ కళాకృష్ణ, ఆంధ్ర సారస్వతపరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్, అవధానధుని, జాతీయ సాహిత్య పురస్కారగ్రహీత సురభి శంకరశర్మ, రాష్ట్రపతి బాదరాయణ సమ్మాన్ పురస్కార గ్రహీత డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, విశ్రాంత సంస్కృతోపన్యాసకులు కిడాంబి భక్తవత్సలం, డాక్టర్ మురళీధర్‌రెడ్డి , డాక్టర్ భరత్, డాక్టర్ రాజ్యలక్ష్మి, శ్రీకాంత్, శకుంతల, రాజేష్, జాతీయ సాహిత్య సాంస్కృతిక సమితి జిల్లా కన్వీనర్ ఎంవిఎస్ శాస్త్రి, తదితరులు (తరువాయి 4లో...)

# ప్రపంచానికి దిక్సూచి లాంటివారు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

ప్రపంచానికి దిక్సూచి లాంటివారు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని కేశవరాజుకుంటలోని చిన్న మల్లేశ్వర కాలనీలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భవనం , పది అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణలో పాల్గొని అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల వారికే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగ అందించిన ఘనత అంబేద్కర్ అని అన్నారు. హిందూ కోడ్ బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపాదించినందుకు నిరసనగా ఆయన న్యాయశాఖ మంత్రికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. స్థానిక నాయకులు 20 లక్షల రూపాయల వ్యయంతో అంబేద్కర్ గ్రంథాలయంతో పాటు విగ్రహాన్ని నిర్మించడం ఎంతో శుభపరిణామని ఈ ప్రాంతం పెద్ద విశాలమైన రోడ్లతో నిర్మాణం కాబోతుందని ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతున్న అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్ కుమార్, ఉడా చైర్మన్ షేక్ రియాజ్, పిడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, కామేపల్లి శ్రీనివాసరావు, శశికాంత్ భూషణ్, బండారు మదన్, బి వెంకట్, అంబేద్కర్ విగ్రహ కమిటీ పోర్ల అంకమ్మరావు, ఆరితోటి చిరంజీవి, ఆబోతు వెంకటేశ్వర్లు, అంజయ్య, తిమోతి, నరసింహం, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# రాధాస్ గీతం హై స్కూల్‌లో ఘనంగా కాన్వకేషన్



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 12)

మేదరమెట్లలోని రాధాస్ గీతం హై స్కూల్‌లో ప్రీ ప్రైమరీ, 5వ తరగతి విద్యార్థులకు ఘనంగా కాన్వకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఈ తరహా కాన్వకేషన్ కార్యక్రమాన్ని తొలిసారిగా నిర్వహించిన పాఠశాలగా రాధాస్ గీతం హై స్కూల్ నియోజకవర్గంలోనే ప్రత్యేకత సాధించింది. కార్యక్రమంలో విద్యార్థులు ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చారు. రింగ్ డాన్స్, అబాకస్, వేదిక్ మ్యాథ్స్, అకడమిక్ స్టాండర్డ్స్‌కు సంబంధించిన ప్రదర్శనలు తల్లిదండ్రులను, అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె. రాధా కృష్ణ కుమారి మాట్లాడుతూ విద్యార్థుల సర్వాంగీణ అభివృద్ధే పాఠశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యతో పాటు సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. పాఠశాల అధ్యక్షుడు కె సతీష్ బాబు విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇదే లాస్ట్ వార్నింగ్... ఈసారి యాక్షన్ తప్పదు





ప్రకారం తమకు ఆహారం పెట్టడం లేదని విద్యార్థులు ఎమ్మెల్యేకి చెప్పారు. ప్రస్తుతం ఉన్న రూములు సరిపోవటం లేదని, చిన్న రూముల్లో 8 మంది ఉండాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం అందించిన వాటర్ కూలర్ ను వెంటనే బిగించి అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం టిఆర్ఆర్ కాలేజీ ఆవరణలో బాలికల హాస్టల్ ను కూడా నాగేశ్వరరావు తనిఖీ చేశారు. అక్కడ కూడా మెనూ పాటించడం లేదని విద్యార్థులు ఎమ్మెల్యేకి చెప్పారు. ఆదివారం ఉదయం మెనూ ప్రకారం అల్పాహారంలో గుడ్డు ఇవ్వలేదని, కూరలు చాలినంత పెట్టడం లేదని ఫిర్యాదు చేశారు. హాస్టల్ లో పరిస్థితులను గమనించాక, వార్డెన్లపై ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిరోజుల క్రితం ఇదే హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి, పద్ధతి మార్చుకోవాలని సూచించినప్పటికీ, మీలో మార్పు రాలేదని అసహనం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఎక్కువ మంది విద్యార్థినులు హాస్టల్‌లో ఉంటున్నట్లు అటెండెన్స్ ఎందుకు వేశారని వార్డెన్లను ప్రశ్నించారు. ఇదే లాస్ట్ వార్నింగ్. ఈసారి క్షమించడం ఉండదు... యాక్షన్ తప్పదు.. అని ఎమ్మెల్యే వారిని గట్టిగా మందలించారు.

# డాక్టర్ రమేష్ కృష్ణకు అభినందనల వెల్లువ

గ్రంధావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరిన్ని పరిశోధనాత్మక గ్రంథాలు డాక్టర్ రమేష్ కృష్ణ చేతుల మీదుగా వెలువడాలని ఆకాంక్షించారు. డాక్టర్ రమేష్ కృష్ణకు వివిధ భాషలలో నాట్య రీతులలో గల విశేష ప్రజ్ఞను వక్తలు అభినందించారు. దేశంలోని అనేక ప్రాంతాల నుండి విచ్చేసిన అభిమానులు, శిష్యులు, సాహిత్య సంఘాల ప్రతినిధులు డాక్టర్ రమేష్ కృష్ణను ఘనంగా సన్మానించారు. తనకు జరిగిన సన్మానానికి డాక్టర్ రమేష్ కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. చందు డాన్స్ అకాడమీ కళాకారులు తమ నాట్య ప్రదర్శనతో ప్రేక్షకులను విశేషంగా అలరించారు.








# మంచి సేవకుడు గుంటుపల్లి శ్రీనివాసులు

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు






(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 12)

మంచి సేవకుడు గుంటుపల్లి శ్రీనివాసులు అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. లింగసముద్రం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అధికారి గుంటుపల్లి శ్రీనివాసులు పదవీవిరమణ కార్యక్రమం ఆదివారం కందుకూరు పట్టణంలోని లక్ష్మీతిరుమల కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముందుగా శ్రీనివాసులు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా గుంటుపల్లి శ్రీనివాసులు చక్కటి సేవలు అందించారని, మంచి అధికారిగా ప్రజల్లో గుర్తింపు పొందారని ప్రశంసించారు. శ్రీనివాసులు శేషజీవితం ఆయురారోగ్యాలతో, సంతోషంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది



మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధర్మవరంలో అర్ధరాత్రి ఆర్‌ఎంపీ డాక్టర్ దారుణ హత్య

ఈ హత్య వార్త తెలియడంతో ప్రజలు ఉలిక్కిపడి గుంపులు గుంపులుగా చేరి భయాందోళనతో చర్చించుకుంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మొత్తం మీద ఆర్‌ఎంపీ డాక్టర్ కోటిరెడ్డి హత్య గ్రామాన్ని ఉలిక్కిపడేలా చేసింది.



# అద్దంకిలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, వక్తృత్వ పోటీలు



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 12)

భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా విద్యార్థుల్లో సామాజిక అవగాహన పెంపొందించేందుకు టాలెంట్ టెస్ట్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మహాత్మా పూలే–అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ ప్రకాశం బాలుర పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన జీవిత చరిత్రపై ఉదయం 10 గంటలకు టాలెంట్ టెస్ట్ నిర్వహించగా, అద్దంకి నియోజకవర్గ స్థాయిలో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అదే విధంగా మహాత్మా జ్యోతిబా పూలే జీవిత విశేషాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించడం విశేషం. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ. 3,116, రెండవ బహుమతిగా రూ. 2,116, మూడవ బహుమతిగా రూ. 1,116 చొప్పున ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ రావ్ భారత్ పార్టీ అద్దంకి నియోజకవర్గ ఇంచార్జి పులిపాటి హేబేలు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను యువత ఆచరణలో పెట్టాలని, విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని ఆయన సూచించారు. కార్యక్రమంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

## ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా కార్డన్ సెర్చ్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

మాదక ద్రవ్యాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిని లక్ష్యంగా చేసుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు అధ్వర్యంలో ఒంగోలు టు టౌన్ సీఐ యం శ్రీనివాసరావు, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్, 7 మంది ఎస్ఐలు, 50 మంది పోలీస్ సిబ్బంది కొత్తపట్నంలోని పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 'ఆపరేషన్ వజ్రా ప్రహార్' లో భాగంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీలలో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాల పై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇళ్లు, దుకాణాలు, పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. పత్రాలు లేని 26 వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమానితులను మొబైల్ చెక్ డివైస్ ద్వారా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిస అయితే వ్యక్తి ఆర్థికంగా, కుటుంబ పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తి తన చర్యలపై నియంత్రణ కోల్పోయి అనేక అనర్థాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మత్తు పదార్థాల విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం ప్రధాన కారణమని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్ ద్వారా ఓటీపీలు చెప్పమని మోసపూరితంగా డబ్బులు దోచుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే క్రికెట్ ఆన్‌లైన్ గేమ్స్ మరియు బెట్టింగ్‌లలో పాల్గొని లక్షల రూపాయలు కోల్పోయిన వారు ఉన్నారని, యువత వీటి నుండి దూరంగా ఉండాలని సూచించారు. ఆధార్ కార్డులను అపరిచితులకు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఆధార్ వివరాలను దుర్వినియోగం చేసి సిమ్ కార్డులు తీసుకుని నేరాలకు పాల్పడే అవకాశముందని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశ చూపించి మోసాలు చేసే వ్యక్తులు సమాజంలో పెరుగుతున్నారని, అలాంటి వారిని నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కొత్తపట్నంలోని గంగమ్మ కాలనీ పాలెం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలతో కలిసి "మత్తుకు దూరంగా ఉండాలి-మత్తు లేని సమాజాన్ని నిర్మిద్దాం" అనే ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులు లేదా డైల్ 112 లేదా పోలీస్ వాట్సఅప్ నెంబర్ 9121102266 తెలియజేయాలని ప్రజలను కోరారు.

## కీర్తన మరణానికి కారణమైన వెంకటేష్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

### కీర్తన కుటుంబానికి న్యాయం చేయాలి

### మహిళల భద్రత కోసం చట్టాలను మరింత కఠినంగా అమలు చేయాలి

### ఏపీ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు చంబల్లా అయ్యప్ప



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

ప్రేమ పేరుతో ముదిరాజ్ కులానికి చెందిన కీర్తన అనే బాలికపై దాడి చేసి, మృతి చెందటానికి కారణమైన ఆవుల వెంకటేష్ ను పోలీసులు వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని, బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని ఏపీ ముదిరాజ్ మహాసభ ప్రకాశం జిల్లా అధ్యక్షులు చంబల్లా అయ్యప్ప ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడప జిల్లా కాజీపేట మండలం లో ఇంటర్ చదువుతున్న కీర్తన అనే బాలికపై ఆవుల వెంకటేష్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో దాడి చేశారన్నారు. కీర్తన చికిత్స పొందుతూ మృతి చెందింది అన్నారు. బాలిక ప్రాణాలు పోవడానికి కారణమైన నరహంతకుడు పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కీర్తన కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. మహిళల భద్రత కోసం చట్టాలను మరింత కఠినంగా అమలు చేయాలని, ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నీతి శతకాలు జ్ఞాన దీపాలు సుమతి శతకం పై శ్రీగిరి

## బాల విహార్ విద్యార్థులకు శిక్షణ ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిన్మయ మిషన్ తోడ్పాటుతో శ్రీగిరి గో క్షేత్ర భవన్ లో నిర్వహిస్తున్న శ్రీగిరి బాలవిహార్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సుమతి శతకం పై నిర్వాహకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. భాగవత ప్రచార సేవాసమితి అధ్యక్షులు ఎం వి ఎస్ శాస్త్రి తెలుగులో శతక సాహిత్య ప్రక్రియ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బద్దెన మహాకవి సుమతి శతకంలో రచించిన పద్యాలు మానవులు నీతి మార్గంలో జ్ఞాన మార్గంలో పయనించేందుకు తప్పక ఉపకరిస్తాయని పేర్కొన్నారు. శతకాలు జ్ఞాన దీపాలని విద్యార్థులు శతకాలలోని మంచి విషయాలను అర్థం చేసుకొని తమ జీవితంలో వాటిని పాటించేందుకు పూనుకోవాలని కోరారు. భాస్కర శతకం సుమతి శతకం వేమన శతకం దాశరథి శతకం కృష్ణ శతకం కుమారీ శతకం కుమార శతకం వంటి పలు శతకాలు నీతి ప్రబోధ కాలని వాటిని విద్యార్థులు తప్పక నేర్చుకోవాలని సూచించారు. సుమతి శతకం పై ప్రతి ఆదివారం విద్యార్థులకు కొన్ని పద్యాలు నేర్పడంతో పాటు వారికి పద్య కంఠస్థ పోటీలను నిర్వహించి బహుమతులను కూడా అందజేయడం జరుగుతుందని వివరించారు,. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ భారత భాగవత రామాయణాలతోపాటు నీతి శతకాలకు కూడా సమాజంలో మంచి ఆదరణ ఉందని విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞ కలిగిన వారుగా ఎదిగేందుకు పూర్వీకులు రచించిన మహాకావ్యాలు శతకాలు దోహదం చేస్తాయని తెలిపారు. బాల విహార్ విద్యార్థులు గోవింద నామాలు హనుమాన్ చాలీసా.. భగవద్గీత శ్లోకాలతో పాటు దేశభ క్తి గీతాలను ఆలపించారు. అంత్యాక్షరి పోటీలో ఉత్సాహంతో పాల్గొన్నారు, రామాయణ కథల పుస్తకంలోని చిత్రాలకు రంగులు అద్దారు. శ్రీ గిరి దేవస్థానం నిర్వాహకులు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో పాటు భక్తులకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. శ్రీగిరి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో ప్రతి ఆదివారం శ్రీగిరి గో క్షే త్రంలో నిర్వహిస్తున్న శ్రీగిరి బాలవిహార్ శిక్షణా తరగతులను విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.





# ఐపిఎల్ సందర్భంగా క్రికెట్ బెట్టింగ్‌ల పై పోలీసుల తనిఖీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

ప్రస్తుతం జరుగుతున్న ఐపిఎల్ సందర్భంగా యువకులు, ఉత్సాహవంతులు బెట్టింగులకు అలవాటు పడుతున్నందున వాటిని అరికట్టే క్రమంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టూ టౌన్ సీఐ ఆదేశాలతో టూ టౌన్ ఎస్ఐ పున్నారావు తన సిబ్బందితో రామ్‌నగర్‌లో యువత సెల్ ఫోన్లు చెక్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్‌కి యువత బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అలాంటి క్రికెట్ బెట్టింగ్‌ను అరికట్టడానికే చెకింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ఐపీఎల్ సీజన్‌లో అక్రమ క్రికెట్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం

### క్రికెట్ బెట్టింగ్ పై దృష్టిసారించిన సీఐ మల్లికార్జున





(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 12)

కంభం పట్టణంలో ఐపీఎల్ సీజన్ సందర్భంగా అక్రమ క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కంభం సీఐ మల్లిఖార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

ఈ తనిఖీలలో భాగంగా పట్టణంలోని టీ దుకాణాలు, హోటళ్లు వంటి ప్రజలు ఎక్కువగా గుమికూడే ప్రాంతాల్లో పోలీసులు సోదాలు చేపట్టారు. అక్రమ బెట్టింగ్‌కు సంబంధించిన ఎటువంటి అనుమానాస్పద కార్యకలాపాలు ఉన్నాయా అనే దానిపై దృష్టి సారించారు.పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ, అక్రమ క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొనడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## పార్టీ క్యాడర్‌తో పొలిటికల్ దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

ఒంగోలులో మంగమూరు రోడ్డులో మర్రిచెట్టు దగ్గర ఆదివారం సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో పెద్దకొత్తపల్లి పంచాయతీకి సంబంధించిన పార్టీ క్యాడర్‌తో పొలిటికల్ దర్బార్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ నిర్వహించారు. ఈ పొలిటికల్ దర్బార్‌లో నాయకులు, కార్యకర్తలను కలిసి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ గ్రామ నాయకులు, కార్యకర్తలు పలు అభివృద్ధి, ఇతర సమస్యల గురించి ఎమ్మెల్యేకి వివరించారు. వారి సమస్యలను ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ తక్షణమే పరిష్కారం చూపుతానని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

## వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

ప్రకాశం జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం జి రమేష్, సోములు, పి జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 23 నెలలు గడుస్తున్న వీఆర్ఏల సమస్య ఏ ఒక్కటి కూడా పరిష్కారం చేయలేదన్నారు. వీఆర్ఏలకు గత 9 సంవత్సరాలుగా జీతాలు పెరగలేదన్నారు. రాష్ట్రంలో మంత్రులు ముఖ్యమంత్రులు మారుతున్నారు గాని వీఆర్ఏల కష్టాలు సమస్యలు తీర్చేవారు కనిపించడం లేదన్నారు. వీఆర్ఏలతో అక్రమ డ్యూటీలు చేయిస్తున్నారని, జీతం బెత్తడు, బండ చాకిరి చేస్తున్నారని, వీఆర్ఏలు శ్రమ దోపిడికి గురవుతున్నారని, ప్రక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేసి ప్రభుత్వ ఆదుకుంటుందన్నారు. ఇక్కడ మన రాష్ట్రంలో కూడా వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, చదువుకున్న వీఆర్ఏలు ఎప్పటికైనా వీఆర్వోగా ప్రభుత్వం చేస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ప్రమోషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. వన్ టైం సెటిల్మెంట్ ద్వారా వీఆర్వో ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి నామినీలుగా కనిపిస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించడం లేదన్నారు. ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న వీఆర్ఏలకు వయోభారం పెరుగుతుందన్నారు. దళిత గిరిజన బడుగు బలహీన వర్గాలకు చెందిన వీఆర్ఏలను ఆకలి బాధల నుండి ప్రభుత్వం ఆదుకోవాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని , వీఆర్వో ,అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్ శాతాన్ని 70%కు పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని కోరడమైనది. వీఆర్ఏల సమస్యలు పరిష్కారం




చేయకపోతే పోరాటాలకు సమ్మెకు సిద్ధమవుతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. వీఆర్ఏల సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, వీఆర్ఏలు వేతనాలు పెంచుతామన్నా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వేతనాలు పెంచలేదన్నారు. తెలంగాణలో పే స్కేల్ అమలు చేయడంతో, వీఆర్ఏలకు, దాదాపు 20,000 పైగ వేతనాల అమలు అవుతున్నాయి అన్నారు. వేతనాలు పెంచకుండా, ఖాళీలు భర్తీ చేయకుండా, వీఆర్ఏలతో నైట్ వాచ్మెన్ డ్యూటీలు, అటెండర్ డ్యూటీలు, డ్రైవింగ్ డ్యూటీలు, అక్రమంగా పనిచేస్తున్నారు అన్నారు. వాటిని తక్షణం రద్దు చేయాలన్నారు. రాష్ట్ర నాయకురాలు జ్యోతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న వీఆర్వో, రికార్డ్ అసిస్టెంట్, అటెండర్ ,నైట్ వాచ్మెన్ పోస్టులను వీఆర్ఏల చేత పూర్తిగా భర్తీ చేయాలి. అనంతరం ప్రకాశం జిల్లా వీఆర్ఏల సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా పి జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా జి రమేష్, కోశాధికారిగా కనపర్తి సోములును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల వీఆర్ఏలు అందరూ పాల్గొన్నారు.

## డాక్టర్ జయరావుని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే బుర్రా



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 12)

కందుకూరు వైస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో వైస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన డాక్టర్ బద్దిపూడి జయరావుని ఆదివారం మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణ బలిజ సంఘం సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తాం



### ఎంపి మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)


కృష్ణ బలిజ సంఘం సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి హామీ ఇచ్చారు. ఒంగోలు నగరంలోని ఎస్‌జివిఎస్ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ కృష్ణ బలిజ సంఘం 14వ రాష్ట్ర మహాసభలు సంఘ రాష్ట్ర అధ్యక్షులు తీర్లక శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకర్‌రావు, ఉడా ఛైర్మన్ షేక్ రియాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ కృష్ణ బలిజ కులస్థులను బీసీ-డీ నుండి బీసీ-ఏలో చేర్చే అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. జిల్లాలో సంఘ సభ్యులకు ఎటువంటి సమస్యలున్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ బీసీలకు వెన్నెముకగా నిలిచే పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు తీర్లక శ్రీనివాసరావు నిబద్ధతను ఆయన కొనియాడారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని తెలిపారు. తన గెలుపులో కృష్ణ బలిజ సంఘం కీలక పాత్ర పోషించిందని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు తీర్లక శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి తనవంతు సహాయం చేస్తానని, సభ్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. సంఘం కోసం రూ.5 లక్షల నిధిని ఏర్పాటు చేయడంతో పాటు, సొంత భవనం నిర్మించే దిశగా అడుగులు వేస్తామని ప్రకటించారు. బీసీఏ వర్గీకరణ కోసం అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని





పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ తోట త్రిమూర్తులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివ రాఘవయ్య, గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు, సుబ్బారావు, ఉడా ఛైర్మన్ షేక్ రియాజ్, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను ఘనంగా సత్కరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సంఘ ప్రతినిధులు సత్కారించారు.

## మొర్రి వారి వివాహ వేడుకలో ఎమ్మెల్యే ముత్తుముల



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఏప్రిల్ 12)

రాచర్ల మండలంలోని యడవల్లి గ్రామంలో మొర్రి వెంకటేశ్వర్లు, ప్రమీల కనిష్ఠ పుత్రుడు ప్రసాద్, సింధుల వివాహ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు భవనం పుల్లారెడ్డి, భవనం శ్రీధర్ రెడ్డి, గిద్దలూరు మండల విద్యాశాఖ అధికారి అశ్విని కుమార్, గిద్దలూరు సొసైటీ బ్యాంకు ఛైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, కుటుంబ సభ్యులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య, బంధుమిత్రులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## రెండవ రోజు దీక్ష కొనసాగిస్తున్న మిరియం శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

మంగళగిరిలో బిసివై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షకు మద్ధతుగా 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒంగోలులో చేపట్టిన దీక్ష రెండో రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు మద్దతుగా మాణిక్యాల శిరీష, మాణిక్యాల సుజాత, చేవూరి రాంబాబు, సిందూరి శ్రీనివాసచారి, గోపిరెడ్డి, అరుణ నాయుడు, ఏడుకొండలు, గోపి జాజుల, శ్రీనివాసులు, మిరియం శ్రీనివాసులు, సల్ల హరి పాల్గొని దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు చల్ల హరి మాట్లాడుతూ రామచంద్ర యాదవ్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు ఒంగోలులో రామచంద్ర యాదవ్‌కి మద్దతుగా మిరియం శ్రీనివాసులు చేస్తున్న దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. బీసీల ప్రధానమైన ఐదు డిమాండ్ల పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న తమ నాయకులకు ఏది జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

# రఘురామ కృష్ణంరాజును అరెస్ట్ చేయాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

రాముడు పేరుతో ఆకువీడు మాలపల్లిలోకి పోలీసు బలగాలతో వెళ్లి బొట్టు లేని మహిళలు అంటూ అవమానించిన డిప్యూటీ స్పీకర్ హోదాలో మాలపల్లి పై దాడి చేసి అక్రమ అరెస్టులు చేయించిన ఆంధ్ర కి ఆంధ్రా రాజాసింగ్ రఘురామకృష్ణంరాజును మత విద్వేషం చట్టం కింద అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేలం డిమాండ్ చేశారు. ఆదివారం తమ కార్యాలయం నందు జరిగిన నిరసన కార్యక్రమంలో పేద ప్రజలు బ్యాంకుల్లో దాచుకున్న వేలకోట్ల రూపాయలను వ్యాపారాల పేరుతో ఫేక్ కంపెనీలు స్థాపించి వేలాది కోట్లు దోచుకున్న, సిబిఐ కేసులు ఉన్న మోసగాడు. దళిత అధికారులైన పీవీ సునీల్ కుమార్, విజయ్ కుమార్, హర్ష కుమార్, జడ శ్రావణ్ కుమార్‌లను వీడు, వాడు పనికిమాలిన వెధవలు అంటూ పబ్లిక్‌గా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అండతో అవమానించటం కూటమి ప్రభుత్వ సనాతన ధర్మమా అన్నారు. తమ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని అవమానించారని కార్యకర్తల పై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి అరెస్టు చేయిస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ డిప్యూటీ స్పీకర్ పోస్టులో ఉన్న బ్యాంకు లూటి కింగ్ పై కేసు నమోదు చేయించాలన్నారు. ఆకివీడు మాల పేట భాదితులకు అండగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం లో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ఆకివీడు నియోజకవర్గంలో అనుమతి లేని చర్చ్ లను కూల్చి వేయటానికి నోటీసులు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలోని అనుమతులు లేని గుడులు, వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలను కూడా తొలగించాలని డిమాండ్

## దళిత నేత నీలం

చేశారు. ఆకివీడు మాల పేట పై డీప్యూటీ స్పీకర్ హోదాలో,




పోలీస్ బలగాలతో టీడీపీ, జనసేన కార్యకర్తలతో వెళ్లి మత ఘర్షణల కు సనాతన కూటమి డాడీ చేయటం హెయమన్నారు. ఆకువీడు ఘటన లో 63మంది మాలల పై హత్యయత్నం మత విద్వేస చట్టం క్రింద పోలీస్ కేసు లు పెట్టి 10వ తరగతి పరీక్షలు రాయకుండా పిల్లలును, మహిళలను అరెస్టు చేయటం కూటమి ప్రభుత్వం మాలల అణిచి వెతకు నిదర్శనం అన్నారు. మాలల పై రఘురామకృష్ణం రాజు మనువాద అధికార దాడిని టీడీపీ, జనసేన తో పాటు ప్రతి పక్ష మైన పార్టీ కూడా ఖండించలేదు అన్నారు జెల్లో వున్న వైఎస్సార్ పార్టీ నాయకులను జైలు లోపలకి వెళ్లి పరామర్శించిన జగన్ ఆకివీడు ఎందుకు వెళ్ళలేదన్నారు. మాల పేరుతో కుల సంఘాలలో ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చెర్మెన్ పదవులు పొందిన జూపూడి ప్రభాకర్ లాంటి మాల మేధావులు ఆనెటవీడు పై ఎందుకు నోరు విప్పడం లేదు అన్నారు. తెనాలిలో మాల యువకులపై పోలీసులు అధికారులు చేసిన దాడి పై స్పందించి న రాజ్యాంగం నిపుణురాలు హోమ్ శాఖ మంత్రి అనిత, ఆకివీడు మాల బాధితులను పరామర్శించలన్నారు. ప్రకాశం జిల్లా బండ్లమూడి లోమాదిగ ల పై జరిగిన చిన్న దాడి పై స్పందించి, స్వయంగా విచారణకు వచ్చి అగ్రకుల నిందితులను రెడ్లను అఘమేఘాల మీద స్పందించి అరెస్టు చేయించిన ఎస్సీ కమిషన్ చెర్మన్ జవహర్ ఆకివీడు మాలపేటను సందర్శించి మాలలపై దాడి చేసిన రఘురామకృష్ణంరాజు ముఠాపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి అరెస్టు చేయాలన్నారు. ఆకు వేడు మాలలపై ఓటమి ప్రభుత్వ సనాతన దాడిలో పాల్గొన్న రఘురామకృష్ణ రాజు పై ప్రైవేటు కేసు హైకోర్టులో వెయ్యాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాకుమాను రవి, మేడికొండ మురళి, యానాది సంఘం నాయకులు కోలా జీవరత్నం, బొమ్మల వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ మంత్రి మానుగుంట






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 12)

మండలంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన గోసుల రాజశేఖర్‌రెడ్డి వివాహ వేడుక సింగరాయకొండ సాయి శ్రీనివాస కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానుగుంట అభిమానులు పాల్గొన్నారు.

# 108 వాహన పైలట్‌కు ఆర్థిక సహాయం అందజేత



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 12)

కొరిశపాడులోని ప్రభుత్వ ఆసుపత్రి నందు 108 వాహనంలో పైలట్ గా విధులు నిర్వహిస్తున్న రాయపాటి ప్రసాదరావు మార్చి 24వ తేదీన బైక్ పై డ్యూటీకి వెళ్తుండగా కారు ప్రమాదానికి గురయ్యాడు. గాయపడిన తనకు, జిల్లాలోని 108 సిబ్బంది అందరూ కలసి ఆర్థిక సహాయం నిమిత్తం రూ.5 వేలు నగదును సేకరించారు. 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి హరిబాబు, గ్రీవెన్స్ కమిటీ మెంబెర్ కోటేశ్వరరావు లు ఆ నగదును ఆదివారం పైలట్ ప్రసాద్ ఇంటికి వెళ్లి స్వయంగా అతనికి అందచేశారు.

# రహదారిపై నుంచి నివాసానికి నిరాశ్రయులకు పునరావాసం





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 12)

బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి, తలదాచుకోవడానికి నీడ లేక ఫుట్‌పాత్‌ల పైనే కాలం వెళ్లదీస్తున్న నిరాశ్రయులకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అండగా నిలిచి, నైట్ షెల్టర్ ద్వారా ఆశ్రయాలు కల్పించారు. పూజిత మహిళా సొసైటీ ఆధ్వరంలో విజయవాడ నగరంలోని బి.ఆర్.టి.ఎస్ రోడ్డు పరిసరాల్లో ఉన్న సుమారు 40 మందిని గుర్తించి వారికి పునరావాసం కల్పించారు. శని, ఆదివారాల్లో అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వీరిని నైట్ షెల్టర్లకు తరలించారు. రోడ్ల వెంట ఆశ్రయం లేక ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి, వారికి అవసరమైన కనీస సదుపాయాలు కల్పించడంలో సొసైటీ ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపారు. వీరందరినీ అయోధ్య నగర్‌లోని శ్రీ వై కన్వర్జేషన్ హాల్ ఎదురుగా ఉన్న నిరాశ్రయుల వసతి గృహానికి తరలించి, అక్కడ భోజన, వసతి సౌకర్యాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శ్రీకాంత్, కిషోర్, యుసిడి పిఓ విజయలక్ష్మి పాల్గొన్నారు. సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ సిఐ, వారి సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టారు. నగర వీధుల్లో ఎవరూ ఆశ్రయం లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో పూజిత మహిళా సొసైటీ, కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

# సంఘం ఏరియాలో కార్డన్ అండ్ సెర్చ్





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 12)

మండల కేంద్రమైన ఉలవపాడు హైస్కూల్ సంఘం ఏరియాలో ఆదివారం ఉదయం కందుకూరు సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కందుకూరు డిఎస్పి బాలసుబ్రహ్మణ్యం, గుడ్లూరు సిఐ నరేష్, కందుకూరు సీఐ అన్వర్ బాషా , కొండేపి, పొన్నలూరు, కందుకూరు టౌన్, కందుకూరు రూరల్, వివి పాలెం, లింగసముద్రం ఎస్సైలు , సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం నాలుగు వరుసల్లో ఉన్న 168 ఇళ్లను చెక్ చేయడం జరిగింది. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను వస్తువులను తనిఖీ చేయడం జరిగింది. గంజాయికి సంబంధించి తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 37 మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. అనంతరం స్థానిక ప్రజలతో కలిసి గంజాయి వ్యతిరేకంగా ప్రమాణం చేయించడం జరిగింది. ఆ తర్వాత హై స్కూల్ సంఘం నుంచి ప్రధాన రహదారి వరకు డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ఆపరేషన్‌లో సుమారు 50 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గంజాయికి సంబంధించి లేదా మరే ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 కు సమాచారం ఇవ్వాలని కందుకూరు డిఎస్పి సూచించారు.





# ఉభయ దేవస్థానాలను సందర్శించిన హైకోర్టు జడ్జి

### స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించిన హైకోర్టు జడ్జి హరిహరనాథ శర్మ



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఏప్రిల్ 12)

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి, శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారి ఆలయాలలో హైకోర్టు జడ్జి హరిహరనాథ శర్మ వారి కుటుంబ సభ్యులతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. వారికి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి డి అనీల్ కుమార్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో పూలమాలవేసి స్వాగతం పలికారు. అనంతరం వారికి అమ్మవారి ఫోటోను బహుకరించారు. ఆ తదుపరి ప్రధాన అర్చకులు విశ్వనాథ శర్మ, ప్రసాదశర్మలు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఘనంగా శ్రీ సీతారాముల వారి ఆలయ ప్రతిష్ఠ





(షణ్ముఖ వెలుగు, బల్లికురవ, ఏప్రిల్ 12)

మండలంలోని కె రాజుపాలెం గ్రామంలో శ్రీ సీతారాముల వారి ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ ప్రజల శ్రేయస్సు, రాష్ట్ర అభివృద్ధి కోసం దేవుని ఆశీర్వాదాలు కోరుకున్నట్లు తెలిపారు. ఆలయాల అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందుతుందని, సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

## రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని మృతదేహం



(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, ఏప్రిల్ 12)

మండలంలోని రామన్నపేట పంచాయతీ సమైక్య నగర్ సమీపంలో రైల్వే ట్రాక్ అవతల గుర్తుతెలియని మృతదేహం కనిపించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ జనార్ధన్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తిగా భావిస్తున్నారు. మృతి చెంది రెండు రోజులైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ జనార్ధన్ చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## బెట్టింగ్ మాఫియా పై ఒంగోలు పోలీసులు ఉక్కుపాదం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఉత్తర్వులు మేరకు ఒంగోలు డిఎస్పీ రావిపాటి శ్రీనివాసరావు అద్వర్యంలో ఒంగోలు తాలుకా ఇన్స్పెక్టర్ టి విజయ కృష్ణ తమ సిబ్బందిని 5 టీంలు గా చేసి, ఒంగోలు తాలుకా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బెట్టింగ్ మాఫియా గురించి విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రజలు, యువత బెట్టింగ్ మాఫియా వలలో పడవద్దని పిలుపునిచ్చారు. యువత బెట్టింగ్‌లకు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

# సర్వ మానవ సౌభ్రాతృత్వం కోసం ప్రార్థించండి

**ఎమ్మెల్యే దామచర్ల**

**ఉమ్మడి ప్రకాశం జిల్లా హజ్ యాత్రికులకు అవగాహన కార్యక్రమం**

**పాల్గొన్న ఎంపీ మాగుంట, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య, ఉడా చైర్మన్ షేక్ రియాజ్**





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

ముస్లింలకు అత్యంత పవిత్రమైన హజ్ యాత్రకు మక్కా వెళ్తున్న హాజీలు ప్రపంచ శాంతిని కోరుతూ సర్వ మానవ సౌభ్రాతృత్వం కోసం, దేశ అభివృద్ధి కోసం అల్లాఃను ప్రార్థించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కోరారు. ఆదివారం స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ వద్ద గల షాదీఖానాలో హాజీలకు మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్స్ పంపిణీ మరియు అవగాహన కార్యక్రమం జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం.. వారి సామాజిక అవసరాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుందన్నారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్ళు హాజీలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు సబ్సిడీని అందిస్తున్నదని అన్నారు. హజ్ యాత్ర అనేది ముస్లింలకు ఆధ్యాత్మికంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన పవిత్ర కార్యక్రమం అని, ఆర్థికంగా బలంగా ఉన్న ప్రతి ముస్లిం తప్పనిసరిగా హజ్ యాత్ర చేయాలని అల్లా ఇచ్చిన సందేశాన్ని ఆచరిస్తూ హజ్ యాత్రకు వెళుతున్న హాజీలకు ప్రత్యేక శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ ఏడాది ఉమ్మడి ప్రకాశం జిల్లా నుండి హజ్ యాత్ర కు 60 మంది వెళ్తున్నారని వారి హజ్ యాత్ర సుఖదాయకంగా సాగాలని కోరారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పాలనలోనే మైనార్టీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగిందని చెప్పారు. ఒంగోలు నగరంలో షాది ఖానా స్థల సేకరణతో పాటు షాది ఖానా నిర్మాణం కూడా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ కాలంలో జరిగింది. ఒంగోలు ఈద్గా లో అభివృద్ధి కార్యక్రమాలు నగరంలోని ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కూడా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ కాలంలోనే జరిగిందని స్పష్టం చేశారు. హాజీలను ఉద్దేశించి ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఉడా చైర్మన్ షేక్ రియాజ్ తమ సందేశాన్ని ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుండి వెళుతున్న హాజీలకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు తన సొంత నిధులతో లగేజ్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, ఏపీ హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మౌలానా షేక్ ఆబిద్, బండారు మదన్, బొడ్డపాటి వెంకట్, ముఫ్తీ అసద్ సాబ్, డాక్టర్ నామినేని కిరణ్, గుంటూరు రాంబాబు, హజ్ సొసైటీ సభ్యులు హుస్సేన్, ట్రైనర్ షేక్ మహబూబ్ బాషా, షేక్ కాలేషా బాబు, షేక్ శిలార్, షేక్ మున్వర్, జనసేన నాయకులు షేక్ యూనిస్, హాజీలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

### ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

ఒంగోలులో మంగమూరు రోడ్డు మర్రిచెట్టు దగ్గర సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బి. ఎన్. విజయ్ కుమార్ ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించడమే ఈ దర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి మొత్తం 25 అర్జీలు అందాయి. ప్రతి ఒక్కరి అర్జీని స్వయంగా స్వీకరించిన ఎమ్మెల్యే వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణ అనుమతులు, రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు వంటి అంశాలకు సంబంధించిన అర్జీలు అధికంగా రావడంతో, వెంటనే రెవెన్యూ అధికారులతో చర్చించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టారు. ఇతర విభాగాలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులకు సూచనలు ఇవ్వగా, ఎక్కువశాతం సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం చేశారు. ప్రజా సమస్యలను సాంకేతిక,ఆర్థికపరంగా పరిశీలించి వేగంగా పరిష్కరించేందుకు పని చేస్తానని ప్రజలకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోతినేని శ్రీనివాసరావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# చేనేత కార్మికుల అర్హుల తనిఖీ, దరఖాస్తుల స్వీకరణ

(షణ్ముఖ వెలుగు, జె పంగులూరు, ఏప్రిల్ 12)

రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించి జనకవరం పంగులూరు మండలం కొండమంజులూరులో ఆదివారం అధికారులు లబ్దిదారుల గుర్తింపు ప్రక్రియ నిర్వహించారు. విద్యుత్, చేనేత, జౌళి శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని పథకానికి అర్హులైన చేనేత వస్త్ర కార్మికుల సర్వీసులను పరిశీలించడంతో పాటు వారి దరఖాస్తులను స్వీకరించారు.



**పథకం ప్రధాన ఉద్దేశం, ప్రయోజనాలు...**

ఈ పథకం ద్వారా చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతుంది. చేనేత కార్మికులు నెలకు 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగిస్తే, మొదటి 200 యూనిట్లు ఉచితంగానే పరిగణించి, ఆపైన అదనంగా వాడుకున్న యూనిట్లకు మాత్రమే బిల్లు చెల్లించే వెసులుబాటు కల్పించారు. అద్దంకి నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో విద్యుత్, చేనేత-జౌళి శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసి ఇప్పటివరకు 231 మంది లబ్ధిదారులను గుర్తించారు. ఈ విషయాన్ని అద్దంకి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నల్లూరి మస్తాన్‌రావు, చేనేత, జౌళి శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఏ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కొండమంజులూరు 60 మంది, చవిటిపాలెం 113 మంది, నక్కబొక్కలపాడు 34 మంది, పరిటాలవారి గ్రామం 22, కలవకూరు ఇద్దరు చేనేత కార్మికులను గుర్తించారు.

**మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కృతజ్ఞతలు**

చేనేత కార్మికులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఇటువంటి గొప్ప పథకాన్ని తీసుకొచ్చిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు స్థానిక నాయకులు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ లబ్ధిదారుల గుర్తింపు, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో పంగులూరు విద్యుత్‌శాఖ ఏఈ పి ఆంజనేయులు, కొండమంజులూరు గ్రామ టీడీపీ నాయకులు, చింతల సహదేవుడు, బత్తుల వెంకట్రావు, చేనేత సొసైటీ అధ్యక్షుడు మంచుపర్తి రాజా, కందుల శ్రీనివాసరావు, తదితరులతో పాటు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com